# పరోపకారి

(కథానిక)

గోపాలకృష్ణయ్య బాగా తిరిగి నేర్చినవాడు. పైగా వ్యవహారకర్త కూడాను. ఆయన కాలు పెట్టిన వ్యవహారం గెలువకుండా పోవడం ఇంతవరకు జరగలేదని ప్రతీతి. మళ్లీ బాగా చదువుకున్నవాడు కాదు. ఆ అయిదవ తరగతి చదువే, చదువు; కాకపోతే కాలం పూసుపోక రామావధాన్లు దగ్గర చదివిన రామాయణ. మహా భారతాలు, చదవటం వరకే కాని వాటి వల్ల గోపాలకృష్ణయ్య వ్యవహారదక్షతని నేర్చుకున్నదిలేదు. గోపాల కృష్ణయ్య తండ్రి నిపుణుడు. అయన్ని ఎరిగున్నవాళ్లు ఆయన లక్షణాల్లో ఎక్కువభాగం గోపాల కృష్ణయ్యకు అలవడ్డాయని అనటం కూడా కద్దు. ఏమైనా మనం గుర్తించవలసింది ఒక వ్యక్తిలోని గుణగణాలు వంశపారంపర్యంగా వొచ్చినవని కాదు, స్వశక్తి వల్ల ప్రస్తుతం అతనికున్న స్థాయిని గమనించాలి.

లెస్సగా చదువుకున్న వారితో, గౌరవనీయులతో, ప్లీడరులతో, రాజకీయపెద్దలతో చాలా మందితో గోపాల కృష్ణయ్యకు పరిచయం వుంది. ఆ పరిచయాన్ని ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా జారవిడుచుకోనే, అంతరాయం కలిగించే మసిలిపాలు చేయకుండా నైపుణ్యంగా కార్య కలాపాలు నెరవేర్చుకుంటున్నాడు. అయితే మనం మిక్కిలిగా ఆశ్చర్య పడవలసిందేమంటే- అతనికి కొడుకుల మీదకంటే కూడా కూతుళ్ళమీద ప్రేమ, మక్కువ, ఎక్కువ. ఇది సహజంగా పురుషులలో వుండే లక్షణం కాదు. అతను కొడుకులకు ఆస్థి సంపాదించి పెట్టలేదు. కొన్ని పరిస్థితుల్లో "కొడుకుల్ని" కొడుకులుగా కూడా చూడలేదు. మరి ఆయనకు అంత పగ కొడుకులమీద యెందుకు కలిగిందో కనుక్కొన్న వాళ్లెవరూ లేరు. చిత్రమేమంటే విశేషించి మాటల్లో, తిట్లుతిట్టి, నానా దుర్భాషలాడి కొడుకులమీద తనకున్న ద్వేషాన్ని వెలువరించడు. తను చేయవలసిందీ, చేయదలచుకుందీ గుట్టు చక్కగా, రహస్యంగా ఆచరణలో చేసేస్తాడు. ఇందులోనేవుంది ఆయన నైపుణ్యమంతా.

గోపాల కృష్ణయ్యకు ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. ముగ్గురు కొడుకులకీ అయిన కాడికి అంటే యిచ్చిన కట్నానికి అంగీకరించి మంచీ చెడ్డలు విచారించే పనిలేకుండా పెళ్లిళ్లు చేసి భాగాలు పంచాడు. పెద్దకూతుర్ని కొత్త నాలుగురాళ్లు సంపాదించే వాడికి యిచ్చాడు. రెండో కూతుర్ని ప్రక్క వూళ్లో ఆరెకరాలు కలవాడికి యిచ్చాడు. కొడుకులతో పాటు తనూ సమమైన పాలు పంచుకున్నాడు. ప్రతి సంవత్సరమూ యిద్దరు కూతుళ్ళని యింటికి రప్పించి మంచి చీరెలు పెట్టి పంపుతూండే వాడు,

సంస్కారవాదంలో గోపాల కృష్ణయ్యకు ప్రత్యేకమైన అభిప్రాయాలు లేకపోవటం శోచనీయమైన విషయమే. విధవా వివాహాల్ని అతను ఎన్నడూ నిరసించలేదు కూడా. అలాగే ముసలివాళ్లు పెళ్ళి చేసుకున్నా అతనికి ఇబ్బంది లేదు. డబ్బును గురించి ఆయనకుండే అభిప్రాయాలు అమూల్యమైనవి. డబ్బును సంపాదించటమే ముఖ్యధర్మంగా యెంచుకొని ప్రవర్తించే వాళ్ళంటే గోపాల కృష్ణయ్యకు పడనిమాట వాస్తవమే కాని, అతని వాదం, ఆ ప్రవర్తనలోనే కొన్ని నాగరికమైన మార్పులు రావాలనీ, కేవలం ధనం మీద ఆశవుండి, ప్రతి పనీ అందుకొరకే చేస్తున్నట్టు అగుపడ కూడదనీ. ఆయన ధనం సంపాదించాడు కాని ఆ సంపాదించటంలో కొంత నేర్పును ఉపయోగించాడు. అందువల్ల చెడ్డపేరు సంక్రమించలేదు. సాధారణంగా పెద్దమనుష్యులనబడేవాళ్లు చేసే కొన్ని

వంకర పనులు, గోపాల కృష్ణయ్య తాను చేయకుండా వెనక ఎత్తునవుండి చేయించేవాడు. తన అవసరాల్ని తీర్చుకోనేందుకుగాను వసుధా తెలివి కలవాడు కనుక గ్రామ వ్యవహారాల్లో, గ్రామసింహాలకి అనువుగా వుండి, ఇటు ప్రజల చేత మాటలు పడకుండా, కోటా వొచ్చిన ప్పూడు గోధుమలు కానీ, పంచదార కానీ, గుడ్డలు కానీ సరిపడ్డన్ని తెచ్చుకోనేవాడు. ఇంకో ముఖ్యవిషయ మేమిటంటే జత యెద్లు లేకపోయినప్పటికీ, స్వంత వ్యవసాయం లేకపోయినప్పటికీ బండి పట్టాలు ప్రథమంలో తెచ్చుకొని "బ్లాకు"లో విక్రయించి అధిక లాభాన్ని పొందేవాడు. గోపాల కృష్ణయ్య ఆడంబర ప్రియుడు కాడు. మామూలు దుస్తులు ధరించే జరుపుతాడు వ్యవహారాన్నంతా. ఇంతకీ చెప్పవొచ్చిందేమిటంటే, గోపాల కృష్ణయ్య స్వార్థపరుడూ, అతని అభిమానమంతా కూతుళ్లపైనే వుంటుందనీ, కాని ఆ రెండులోపాల్ని కప్పిపుచ్చుకోనే దక్షత, నేర్పు కూడా ఆయనలో వున్నవనీ. ఇన్ని వ్యవహారాల్లో జోక్యం కల్పించుకోంటూవున్నా అతనికి అంతో ఇంతో శాంతి లభిస్తూనేవుంది. కొడుకుల సంసారాల్లోని లోతుపాతులను సవరించే బాధ్యత ఆయన మీద లేదు కనుక, పెద్దకూతురూ, అల్లుడూ సక్రమంగానే వుంటున్నారు కనుక, రెండో కూతురు ప్రక్క గ్రామంలోనే వుంటుంది కనుక- ఆదుర్దాపడవలసిన అవసరపు ప్రమాదాలకు దూరంగా, నిశ్చింతగా వుండే అవకాశం సంభవించింది.

కాని, ఈమధ్యనే రెండోకూతురు విషయమై కొన్ని దుర్వదంతులు ప్రాకిపోయినయ్. అల్లుడు అంతకంతకూ తిరుగుబోతు వాడవుతున్నాడనిన్నీ, భార్యను కొట్టి తిడుతున్నాడనిన్నీ, దుస్సహవాసం అధికమైందనిన్నీ- ఇన్ని వదంతుల మూలంగా గోపాలకృష్ణయ్య ఆదుర్దాపూరితుడై, వెంటనే చిన్నకూతురు దగ్గరకు వెళ్ళటం జరిగింది.

వొచ్చిరావటంతోనే చిన్నకూతురు హైమవతి తండ్రిని కౌగలించుకొని—

"నాన్నా! యిక్కడ నేను వుండలేను" అని కంట నీరు కార్చింది.

గ్రహించాడు గోపాలకృష్ణయ్య. తను కొన్ని రోజులపాటు అవశ్యంవుండి చిన్నకూతురు జీవితాన్ని చక్కబరచటం మేలు అని కూడా అనుకున్నాడు. "ఫరవాలేదమ్మా! అధైర్య పడకు. అంతా నేను చక్కబరుస్తాను" అని కూతురికి ధైర్యం చెప్పాడు.

హైమవతి మామ గ్రుడ్డివాడు. అత్త కుటుంబాన్ని ఈదుకురాగల సమర్థురాలు కాదు. ఇక ఆడబిడ్డ కృష్ణవేణమ్మ వుంది కాని బహు మేదకురాలు. ఒకళ్ళకు ఏ పరిస్థితుల్లో కూడా ఎదురుచెప్పే స్వభావం కలది కాదు. పదిహేడు యేళ్ళు వొచ్చినాయి. ఇంకా ఆమెకు పెళ్ళి చేయలేదు. ఇకపోతే ఆయింట్లో హైమవతి భర్తకు ఎదురు చెప్పేవాళ్ళు ఎవ్వరూ లేరు. అందువల్ల అతని అధికారానికి అంతు దొరక్కపోతున్నది. ఆయనగారికి వూళ్లోనే యిద్దరు ఉంపుడుకత్తెలు. అల్లుడు పేరు శివరాం.

రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికివొచ్చాడు. తన మామను చూచాడు. కూతురిని చూచేందుకు వొచ్చేడు కాబోలు అనుకున్నాడు.

బయట మండువా వసారాలో వియ్యంకుల కబుర్లు జోరుగా సాగిపోతున్నవి. తన కొడుకు దౌష్ట్యాన్ని గురించి గోపాలకృష్ణయ్యకు వివరిస్తున్నాడు, గ్రుడ్డి వియ్యంకుడు.

"నేనేమో అంధుణ్నాయె! ఏది ఎట్లా జరుగుతూందో మీ విష్యాపురాలు వివరించిందాకా నాకు తెలీకపోయె. అయినా నేనెన్ని అన్నా యేమిలాభం వుంది. నామాట ఆలకిస్తాడా, పెడతాడా! అక్కడికీ నోటిదురద వొదిలించుకోనేందుకు అంటూనే వుంటా. చెవిని పెడితేగా! పైగా కసురుకుంటాడు. ముక్కును తాండవమాడుతూవుంటుంది, కోపం. దానిమాటా వినడాయె! మొన్న వద్లు అమ్మగా వొచ్చిన తొమ్మిదివందల రూపాయలకూ యిప్పుడు వంద రూపాయలు వున్నవి. అదేమిరా అనే వీలు లేకపోయె. ఎట్లా వీడితో వేగాలో మాకు అర్థంగాదు. పైపెచ్చు ఆపిల్లది అడ్డుచెప్పిందని దాన్నిపట్టుకు వృథాగా కొడతాడు. ఇదుగో కృష్ణయ్యగారూ! మీరన్నా కాస్త నయానో భయానో చెప్పి వాణ్ణిసక్రమమార్గంలో పెట్టండి."

ఇదంతా ఆలకించాడు శివరాం. ఈ ప్రకా

రమే కనక తన మామ తనమీద అధికారం చెలాయిస్తే, ఇంక తనంత అసమర్థుడు, అప్రయోజకుడు వుండబోడు. అయినా తనకుటుంబం మధ్యలోకొచ్చి యిరికి, అధికారం చేపట్టటానికి యీయనెవరు? అనుకున్నాడు శివరాం.

ఆరాత్రి భోజనా లయింతరువాత కదిలించి చూశాడు, గోపాలకృష్ణయ్య.

“అబ్బాయీ! శివరాం, తలిదండ్రుల్ని పోషించవలసిన బాధ్యత నీమీద వుంది. దాన్ని గమనించకుండా దుస్సహవాసాలుచేసి, చెడు అలవాట్లను అలవరుచుకొని భార్యనీ, తలిదండ్రుల్నీ హింసించటం సబబుగాదు. తలిదండ్రుల పట్ల కొడుకు ధర్మాన్ని సరైన పద్ధతుల్లో నిర్వహించటం నీవంతు. నా మాటవిని, ఈ కొరగాని సహవాసాలు మానేసి, పొలం వెళ్ళి పాటుపడకపోయినా కూలీలచేత దగ్గరవుండి పనులు చేయించు.”

శివరాం తల వొంచుకొని కూచున్నాడు. లోపల హృదయంలో మామమీద అంతులేని కోపం రగులుతున్నది కాని అణిచిపెట్టుకుంటున్నాడు. మామ సంగతులు తెలుసు, శివరాంకు వ్యవహారజ్ఞానంతో ఎంత పేరు సంపాదించాడో కూడా తెలుసు. ఎదురు చెప్పటానికి జంకాడు. మొదట్నుంచీ మామమీద శివరాంకు ఒకవిధమైన గౌరవభావమే వుంది.

మరునాడు రాత్రికూడా శివరాంకు బోధలు చేశాడు. శివరాం కుక్కిన పేనులాగా గోపాలకృష్ణయ్య చెప్పిందంతా ఆలకించాడు. ఆపైన ఆచరించే విషయాన్ని ఆలోచనకు వొదిలేసి, ఇంతటితో తనపని అయిపోందని తృప్తి పడలేదు గోపాలకృష్ణయ్య. ఒక్కవారం రోజులపాటైనా వుండి తన అల్లుడి ప్రవర్తనని సాకల్యంగా గుర్తించి అవసరమైన సవరణలుచేసి సలహాలు యిద్దామని వుండిపోయేడు. పాపం! శివరాం—“రే పెళ్ళతాడు మామ, ఇవా ళెడతాడు మామ” అని యేరోజు కారోజు ముళ్ళమీద నిలుచున్నట్టు రోజుల్ని గడుపుతున్నాడు. ఈ లోపల “రేపో, ఎల్లుండో వెళ్ళదా”మని అనుకొంటూవున్న గోపాలకృష్ణయ్యకు మరొక గమనార్హమైన బాధ్యత భుజస్కంధాలపైన మోపబడింది.

ఒకరోజు మధ్యాహ్నం, మాటల సందర్భంలో కృష్ణవేణమ్మ పెళ్ళి విషయమై ప్రస్తావన జరిగింది.

“దానికి పెళ్ళి చేయాలంటే మా వలను పడకుండా వుంది. వరుళ్ళను వెతికే తాహతు మా దగ్గరలేదు. వాడేమన్నా చూస్తే ఆ పోకిళ్ళు పోతున్నాడు గోపాలకృష్ణయ్యగారూ! అన్యధా అనుకోకుండా దాని పెళ్ళి విషయమై మీరు కాస్త పని కల్పించుకొని మీకు నచ్చిన వరుణ్ణి యేరి ఆ కాస్తా మీ చేతులమీదుగానే జరిపించండి. అది మట్టుకు “కర్మమా?” అంటూ ఎన్నాళ్ళని పుట్టింటదగ్గర వుంటుంది. అని గుడ్డి వియ్యంకుడు అన్నాడు.

ఈవిషయాన్నే కొద్ది మార్పులతో కొంచెం జాలిగా, వివరంగా అన్నది వియ్యపురాలు.

గోపాలకృష్ణయ్య తనలో తాను నవ్వుకున్నాడు. పైకి గంభీరంగా—“సరే! చూస్తాను. నాకు మీకంటె ఆప్తు లెవరున్నారు కనుక” అన్నాడు.

మరొక వారంరోజులు అక్కడే వున్నాడు, గోపాల కృష్ణయ్య.

* * *

రామచంద్రయ్య కొడుకు పెళ్ళికిగాను, గోపాలకృష్ణయ్య ప్రక్క గ్రామం వెళ్ళవలసివచ్చింది, రామచంద్రయ్య బలవంతంమీద. ఆ వూళ్ళో గోపాలకృష్ణయ్యని ఎరిగిన పెద్దమనుష్యులు చాలామంది వున్నారు. ముఖ్యంగా జానకిరామయ్య, బాల్యంనించీ స్నేహం. పెళ్ళికాగానే పండుకొనేందుకు జానకిరామయ్య యింటికి వెళ్లాడు.

జానకిరామయ్య గోపాలకృష్ణయ్య కంటె రెండుమూడు సంవత్సరాలు పెద్దవాడైనప్పటికీ దృఢంగా, కంటిచూపులో ఎటువంటి లోపం లేకుండా వున్నాడు. అయితే ఒకటి, జానకిరామయ్యకి కుటుంబం లేదు. భార్య లేదు. పిల్లలు లేరు. రెండో సంబంధం భార్య రెండునెలల క్రిందటనే-క్షయవ్యాధితో మూడు సంవత్సరాలు తీసుకొని చచ్చిపోయింది. ఇంకా జానకిరామయ్యకు ఓ పిచ్చినమ్మకం గట్టిగా వుంది, తనకు మూడో పెళ్ళి గీతవుందని. అభిలాష కూడా అదే. ఎవరన్నా నవ్విపోతారనే చిన్న

తనం అసలేలేదు. ఆ అభిప్రాయాన్నే చూచాయగా గోపాలకృష్ణయ్యా దగ్గర వెలువరించాడు.

"గోపాలకృష్ణయ్యా, ఈకాలంలో ముసలివాళ్లు పెళ్ళిచేసుకుంటే లోకులు ఏమంటారు?" అన్నాడు జానకిరామయ్యా.

గోపాలకృష్ణయ్యా హృదయం గతుక్కుమంది. గ్రహించాడు జానకిరామయ్యా మనోభావాన్ని. కాని ఆశ్చర్యపడలేదు.

"యేమనుకుంటారు. అనుకుంటేమాత్రం చేసుకో దలచినవాళ్లు ఆగటం దేనికి? ఎవరి యిష్టంవాళ్లది. ఇందులో ఒకళ్లు అవుననే దేమిటి, కాదనే దేమిటి, ముసలివాళ్లకు కన్య నిచ్చేదాతలుండాలే కాని. ఇట్లాగోపాలకృష్ణయ్య ప్రోత్సహించటం, జానకిరామయ్యాకు అంతులేని ఆనందాన్ని కనిగించింది. మనసులో వేయి దణ్ణాలు పెట్టుకున్నాడు. ఆ పిమ్మట తన మనస్సులో వున్న భావాన్ని మెల్లిగా బయట పెట్టాడు జానకిరామయ్యా.

"నాకు జాతకంలో మూడోపెళ్లి గీత ఎటు గూడివుంది. నాకుగూడా చేసుకోవాలనే వుంది. కాని భయపడుతున్నాను" అన్నాడు.

"ఈ అభిప్రాయం నీకోటివాళ్లకు వుండవలసిందికాదు. దాని దేమిటిలే? నీయిష్టం వొచ్చినరీతిగా మనస్సును వుపయోగించుకొని సాధ్యమైతేఆచరణలో పెట్టు. జానకిరామయ్యా! మూడోపెళ్లి చేసుకోవాలనే అభిలాష నీకు పూర్తిగా వుంది కనుక ఆ మోజును తీర్చుకో! కాని, నే చెప్పేదికూడా విను. ఇది అందరికీ విడ్డూరంగా కనబడితే కనబడవొచ్చు. అంతమాత్రంచేత భయపడటం అవివేకం. నీకు పన్నెండెకరాల నిక్షేపమైన మాగాణీ భూమివుంది. ఆస్తికి కొదువలేదు. అందుచేత యే బీదపిల్లనో వివాహమాడితివా, ఆపిల్ల బాగుపడుతుంది." అన్నాడు గోపాలకృష్ణయ్యా.

ఈ అభిప్రాయం జానకి రామయ్యాకు నచ్చింది. తన మూడోపెళ్లికి యింతమాత్రం ప్రోత్సాహం ఇచ్చేవాళ్లు కనపడకే జానకిరామయ్యా ఇంతగా వగవటం. ఒకళ్లిద్దరు ఏమాత్రం పిల్లనివెదికి వివాహానికి సిద్ధంచేసిపెట్టినా, కనీసం వివాహం చేసుకోవటం యేమంత విడ్డూరం కాదని చెప్పినా, ఇదివరకే పెళ్లిచేసుకొనే వాడు. అటువంటిదేమీ జరక్కపోవటానే గోపాలకృష్ణయ్యామాటలు జానకి రామయ్యాలో నూతనోత్సాహాన్ని రేకెత్తించటానికి పనికి వొచ్చాయి.

"నేనుకూడా అదే అనుకున్నాను, కృష్ణయ్యా! ఈ నాకున్న ఆస్తిలో సెంటుపొలం కూడా వారసులకుపోవటం నాకు సుతరామూ యిష్టంలేదు. అదీకాక, నేను చచ్చేప్పటికి - నాగురించి కంటతడిపెట్టేభార్య ఒకటుండాలని నా ఆశయం. అసలు సహం అందుకే మూడో పెళ్లిచేసుకోవాలనే ఉబలాటం." మూడో పెళ్లిచేసుకోవాలనే కోర్కెకు ముఖ్యకారణం కూడా వివరించి, హృదయాన్ని తేలికపరచుకున్నాడు, జానకి రామయ్యా.

ఆరాత్రి అప్పటికే ప్రొద్దుపోవటం మూలాన పండుకొని నిద్రపోయారు. తెల్లవారుఝామున మామూలుగా నాలుగు గంటలకే మెలకువ వొచ్చింది జానకిరామయ్యాకు. చెప్పటం మరచిపోయాను, ఆరాత్రి జానకిరామయ్యాకు కొన్ని కలలు వొచ్చినవి. అందులో పెళ్లి వైభవంగా జరిగినట్టు, పిల్లని కాపరానికి తెచ్చుకున్నట్టు-వొచ్చినకలలు జానకిరామయ్యాకు సంతోషాన్ని తెచ్చిపెట్టినయ్. మెలుకువ వొచ్చాక వాటిని మననం చేసుకోవటానికి ప్రయత్నించాడు కాని, పెళ్లికూతురు స్ఫురణకు రావటంలేదు. ఏమైనా మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే వాంఛని ద్విగుణీకృత పరిచినయ్ ఆ కలలు. జానకిరామయ్యా



మరొకటికూడా ఆలోచించాడు. "ఎటుగూడీ వధువును తను వెతుక్కోవటం వరుడి లక్షణం కాదు. అందులో తనలాటివాడికి అసలే పనికి రాదు. మరొకడు వెతికి నిర్ణయించాలి. ఈ పనిని నిర్వహించగలవాడు ఒక్క గోపాలకృష్ణయ్యే కనబడుతున్నాడు. ఎట్లాగైనా సరే, బ్రతిమాలుకొని ఈ భారం గోపాలకృష్ణయ్య మీద వేస్తే అతి చాకచక్యంగా చేసుకు రాగలడు. అంతకీ లొంగకపోతే ఓ వెయ్యి రూపాయలిస్తే కార్యరంగానికి పూనుకో గలడు."

తెల్లవారి గోపాలకృష్ణయ్య యింటికి వెళ్ళేందుకు ప్రయాణం కడుతూండగా,

"గోపాలకృష్ణయ్యా! నీమీద ఒక భారం మోపదలుచుకున్నాను, నేర్పుతో నిర్వహించ గలవనే నమ్మకంతో." ముందరి కాళ్ళకు బంధం తగిలించాడు జానకిరామయ్య. ఇటువంటి బంధాలు గోపాలకృష్ణయ్యముందు పనికి రావు, తను యిష్టపడితే మినహాయించి.

"ఏమిటా భారం?" అన్నాడు గోపాలకృష్ణయ్య.

"నిర్వహించగలననే హామీ యిస్తే-"

"చెప్పు-"

"నాకు వధువును వెతికిపెట్టాలి, ఎవరైనా సరే- నీకు నచ్చింది!" నీళ్లు నమిలాడు జానకిరామయ్య.

"అది నావల్లకాదు" అన్నాడు గోపాలకృష్ణయ్య.

"అట్లా తప్పించుకొంటే వీల్లేదు. ఎట్లానైనా సరే వధువునునిర్ణయించి వివాహంజరపవలసిందే. నీ స్నేహితుడు నిన్ను ఈవిషయంలో ఎంతో అర్థిస్తున్నాడు. నాకు ఇంకెవరున్నారు చెప్పు" అని దీనాతిదీనంగా పలికేటప్పటికి గోపాలకృష్ణయ్యకు ఒప్పుకోక తప్పలేదు. ఆయన అంత తేలిగ్గా ఒప్పుకోవటానికి యింకో బలవత్తరమైన కారణం కూడా వుంది. అది తన వియ్యంకుడు తనకు వొప్పజెప్పిన భారం, పిల్ల పెళ్ళివిషయమై.

ఎందువల్లనో పాపం, ఆపిల్లను జానకిరామయ్యకు కుదర్చాలని అనుకోవటంలో కించిత్తు కూడా గోపాలకృష్ణయ్యకు, "ఆపిల్ల వయస్సెక్కడ, జానకిరామయ్య వయస్సెక్కడ" అని కాని, "ఆపిల్ల భవిష్యత్తును నాశనంచేయటం ఎందుకు?" అని కాని, "ఈ వివాహంకుదర్చటంలో లోకులేమంటారు తనని" అని కాని అనిపించలేదు.

జానకిరామయ్య చేతులో చేయివేయించుకొని, తిరుగుడు ఖర్చులకుగాను ఓ యాభై రూపాయలు చేతిలో పెట్టి సాగనంపాడు గోపాలకృష్ణయ్యను. జానకిరామయ్య మంచి పట్టుదల కల మనిషి. ఇతర్లను నమ్మే మనిషి కూడాను.

* * *

గోపాలకృష్ణయ్య అష్టకష్టాలుపడి చివరకు కృష్ణవేణమ్మను జానకిరామయ్యకు యిచ్చేట్టు ఒప్పించాడు, వియ్యంకుడు, వియ్యపురాలు, త్వరగానే అంగీకరించార్లు తమ పిల్లను పిల్లకు యిచ్చేందుకు. చాలా ఆస్తి వొస్తుందని. కృష్ణవేణమ్మ వొప్పుకోవటమే గగనమైంది. అక్కడే గోపాలకృష్ణయ్య కొంత నేర్పునూ, నటననూ ఉపయోగించింది. కొన్ని అబద్ధాలు ఆడేందుకు కూడా జంకలేదు. "జానకిరామయ్య మహా బ్రతికితే యింకో అయిదారేళ్ళు బ్రతికేను. అప్పుడు నీవు విధవరాలు అయినా యేం యిబ్బంది లేదు. పన్నెండెకరాల ఆస్తివొస్తుంది. తరువాత యింకో పెళ్ళి చేసుకోవచ్చు నిరభ్యంతరంగా. వెధవముండలకి పెళ్లిళ్ళు చేయటం ఈరోజుల్లో నాగరీకమై పోయింది. ఎంతమంది విధవలు అట్లా పెళ్లిళ్ళు చేసుకోవటం లేదు కనుక" ఈ ధోరణిలో గోపాలకృష్ణయ్య కృష్ణవేణమ్మకు నీతులు గరిపాడు. ఒప్పించాడు.

(ముగింపు వచ్చే సంచికలో)

ప్రపంచవిప్లవం రావడం అన్నది అసంభవం. అన్ని దేశాలలోని జనాభా ఒకేసారి ఒకే విషయం గురించి పిచ్చివాళ్ళవడం జరగనేరదు.